'స్వాతి' మంత్లీలో ప్రచురితమైన నవల

# డేంజరస్ గై



బి.గీతిక

# డేంజరస్ గై

సుబ్రహ్మణ్యపురం.. పక్కా పల్లెటూరుకీ, పట్నానికీ మధ్యస్తంగా ఉండే ఓ గ్రామం. రాత్రి ఏడు గంటలవుతోంది సమయం. ఆ రోజు అమావాస్య.

ఇళ్ళల్లోని లైట్లన్నీ ఒక్కొక్కటిగా ఆరుతున్నాయి. ఊరంతా నిశ్శబ్దంగా మారిపోయింది. వీధులన్నీ కూడా కళ్ళు పొడుచుకు చూసినా కానరాని కారడవి మాదిరిగా ఉన్నాయి. ఆ ఇళ్ళన్నిటికీ దూరంగా ఉన్న వీరనాగుడి గుడి దగ్గర చీకటి మరింత చిక్కగా ఉంది.

ఆ అమావాస్య చీకట్లో, గుడి పక్కనున్న పచ్చికలోంచి కోడెవయసు తాచుపాము బుసల్లాంటి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు రెండు గొంతుకల్లోంచి ఎంతో గాఢంగా వెలువడుతున్నాయి.

ఆ కటిక చీకట్లో మనవరాలిని వెతుక్కుంటూ తిరుగుతున్నాడు వీరనాగుడి ఆలయ పూజారి నారాయణ పంతులు. ఆయన చేతిలోని టార్చ్‌లైట్ అక్కడి పచ్చిక మొత్తాన్నీ అంగుళం అంగుళం ఎంతో క్షుణ్ణంగా జల్లెడ పడుతోంది.

ఎత్తుగా ఉన్న మట్టి దిబ్బ దిగి, కిందకి వచ్చాడాయన. సరిగ్గా అప్పుడే టార్చ్‌లైట్ ఫోకస్‌లో కనిపించిన దృశ్యాన్ని చూడగానే అదిరిపడ్డాడు నారాయణ పంతులు.

అకస్మాత్తుగా మీద పడిన వెలుగుకి ఒక్కసారిగా ఉలిక్కిపడుతూ చూశారు ఉషా, నాగ్‌వీర్‌లు. కోరికలు ఉరకలేసే పదహారేళ్ళ టీనేజ్‌లో ఉన్నారు వాళ్ళిద్దరూ. తాతని చూడగానే హఠాత్తుగా తెలివి తెచ్చుకున్న ఉష కంగారుగా భయంతో గబుక్కున నాగ్‌వీర్ నుంచి కొంచెం దూరం జరిగింది.

ఉషా ఒంటి మీద చెదిరిన ఓణీనీ, ఆమె అవతారాన్నీ చూడగానే దగ్గరకు దూసుకెళ్ళి ఆమె చెంప ఛెళ్ళుమనిపించాడు నారాయణ పంతులు.

'సారీ, ఇదంతా నా వల్లే' అన్నట్టుగా నాగ్‌వీర్ వంకోసారి చూసి, చెంపని చేత్తో పట్టుకుని వెంటనే అక్కడ నుంచి పరుగుపరుగున వెళ్ళిపోయింది ఉష.

ఆ వెంటనే నాగ్‌వీర్ చెంప కూడా ఛెళ్ళుమనిపించాడు నారాయణ పంతులు.

ఏం మాట్లాడకుండా సైలెంట్‌గా చూస్తూ ఉండిపోయాడు నాగ్‌వీర్. చీకటిలో కూడా తళతళా మెరుస్తున్నాయి పాముకళ్ళ మాదిరున్న నాగ్‌వీర్ కళ్ళు. ఆ కళ్ళు చాలా చిత్రమైనవి, ఎంతో శక్తివంతమైనవి కూడా.

నాగ్‌వీర్ మనసులో ఏ ఫీలింగైతే కలుగుతుందో, ఆ ఫీలింగ్ ఎదుటి మనిషికి అతని కళ్ళలో ఊరికే అర్థమైపోతుంది. అర్థమవడం ఒక్కటే అయితే సమస్యే లేదు, కానీ ఆ ఫీలింగ్ ఎదుటి మనిషిలోకి కూడా ట్రాన్స్‌ఫర్ అవుతుంది. ఇప్పుడు ఆ కళ్ళు పల్చని తడితో ఎంతో బేలగా చూస్తున్నాయి. నాగ్‌వీర్ కళ్ళలోని భావాలకి నారాయణ పంతులు కరిగిపోయాడు.

"మనసు పడితే, పెద్దలతో చెప్పాలి. అంతేగానీ ఆడపిల్లని ఇలా ఒంటరిగా చీకట్లోకి తీసుకొచ్చి తప్పు పనులు

చెయ్యకూడదు. పదా.. మీ నాయనమ్మ గారితో మాట్లాడతాను.." అని ఒకింత మెత్తబడుతూ అన్నాడాయన.

"నాయనమ్మతో ఏం మాట్లాడతారు..?" ఆశ్చర్యంగా అడిగాడు నాగవీర్.

"ఉషా, నువ్వూ ఇష్టపడ్డారుగా. మీ నాయనమ్మ సరే అంటే మీ ఇద్దరూ అర్ధనారీశ్వరులౌతారు.." అన్నాడు నారాయణ పంతులు.

"అర్ధనారీశ్వరులా..! అంటే..?!"

"అర్ధనారీశ్వరుంటే ఇద్దరూ కలిసి ఒకటవడం. మీ ఇద్దరికీ పెళ్ళి చేస్తే అదే అర్థమవుతుందిలే.." చెప్పాడు నారాయణ పంతులు వివరంగా.

"పెళ్ళా..! పెళ్ళేంటీ.." అని కంగారు పడ్డాడు నాగవీర్.

"భయపడుతున్నావా..? మీ నాయనమ్మతో నేను మాట్లాడతానులే. పదా.."

"అది కాదు.. పూజారిగారూ నాకు.. నాకూ.."

"ఏంటి నీకు..?"

"నాకు ఉషని పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదండీ.."

షాక్‌తో ఒకడుగు వెనక్కేశాడు నారాయణ పంతులు. "ఏ..?! ఎందుకు ఇష్టం లేదు..?" కోపంతో మళ్ళీ ఆయన కళ్ళు ఎర్రబడ్డాయి.

"అదీ.. అదీ..నాకు ఉష నచ్చలేదండీ.." మనసులో మాట చెప్పేశాడు.

అంతే, ఆ క్షణం నారాయణ పంతుల్లో వచ్చిన కోపానికి నాగవీర్‌ని చితకబాదేవాడే. కానీ నాగవీర్ పుట్టినప్పటి నుంచీ ఎంతో బాగా దగ్గరగా చూసిన వ్యక్తి, ఒకానొక ఆపద సమయంలో అతడికి ప్రాణం కూడా పోసిన వ్యక్తీ అవడంతో ఆ పని చేయలేకపోయాడాయన.

తనలోని కోపాన్ని బలవంతంగా అణుచుకుంటూ, "ఉష నీకంటే పెద్దదనా..?" సందేహంగా అడిగాడు.

నూనూగు మీసాలతో ఎంతో అందంగా, అమాయకంగా ఉంది నాగవీర్ ముఖం. "కాదు పూజారి గారూ కానీ.. ఏమోనండీ. నాకేం అర్థం కావట్లేదు.." అని అయోమయంగా చెప్పాడు నాగవీర్.

"ఇప్పుడు చిన్నవయసని పెళ్ళి చేసుకోవడానికి భయంగా ఉందా..? పోనీ కొన్నాళ్ళ తర్వాత చేసుకుంటావా.." శాంతబడుతూ అడిగాడు.

సమాధానం చెప్పకుండా తల దించుకున్నాడు నాగవీర్.

నాగవీర్ జవాబు అర్థమైపోయింది ఆయనకి. అంతే. "వెళ్ళు.. ఇక్కణ్నుంచి వెళ్ళిపో.." అని ఆకాశం బద్దయ్యేలా గట్టిగా అరిచాడు.

"సారీ అండీ.." అని, అక్కణ్నుంచి వడివడిగా వెళ్ళిపోయాడు నాగవీర్.

నారాయణ పంతులు కూడా అదే ఎమోషన్‌తో గబగబా ఇంటికొచ్చాడు. ఇంట్లో అందరూ నిద్రపోతున్నారు. ఉషా మాత్రం భయంభయంగా ఓ మూల ముడుచుకుని కూర్చునుంది.

ఇంటికి వచ్చేవరకూ ఆయన నాగవీర్ గురించి ఎంతో తీవ్రంగా ఆలోచిస్తూనే ఉన్నాడు. నాగవీర్ చిన్నతనంలో జరిగిన ఓ అనూహ్య సంఘటన ఆయన మనసులో ఒక్కసారిగా మెదిలి ఏదో అనుమానం బయుదేరింది. అంతే, "ఉషా.. వాడు నీకు మాయమాటు చెప్పి, నిన్ను లొంగదీసుకున్నాడా..? లేక నీకుగా నువ్వే వాడి దగ్గరకెళ్ళావా..? నిజం చెప్పు.. నేను నిన్నేమీ అనను.." అని మనసులో బలంగా ఏదో సందేహం పీకుతుంటే సూటిగా అడిగాడు.

"నాగవీర్ నాకే మాయమాటలూ చెప్పలేదు తాతయ్యా. వాడి కళ్ళు చాలా బావుంటాయి. ఎందుకో తెలీదు, వాడి

కళ్ళల్లోకి చూస్తే నన్ను నేను మైమరచిపోతాను. నిన్నటితో వాడి టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాయి. రేపు సిటీకి వెళ్ళిపోతున్నాడు. అందుకనీ, వాణ్ని చివరిసారిగా కలిసి మాట్లాడాని నేనే అక్కడకి రమ్మన్నాను.." భయపడుతూ భయపడుతూ చెప్పింది ఉష.

హఠాత్తుగా మెదడు మొద్దుబారినట్టు అయిపోయింది నారాయణ పంతులుకి.

పదిహేనేళ్ళ క్రితంనాటి గతం తటాలున కళ్ళముందు మెదిలింది. అంతే..! ఎంతో వేగంగా అక్కడ నుంచి కదిలి, పూజ గది అటక మీదున్న పాతకాలపు ట్రంకు పెట్టెని ఎంతో ప్రయాసపడుతూ కిందకి దించాడాయన.

గబగబా తాళం తీశాడు. దానిలోపల ఘాటైన ముక్కువాసన వేస్తూ పెద్దపెద్ద గ్రంథాలున్నాయి. ఒక్కొక్కదాన్నీ తీసి చూసి పక్కన పడేస్తూ, ఆత్రుతగా దేనికోసమో వెతుకుతున్నాడు. ఆయనకి కావసిన అతి పెద్ద గ్రంథం.. పెట్టె లోపల అడుగునెక్కడో కనిపించింది. అంతే..! ఏదో సాధించినవాడిలా ఆరాటంగా ఆ గ్రంథాన్ని తెరిచి, వెంటనే చకచకా పేజీల్ని తిప్పాడు.

* * *

మర్నాడు ఉదయమే.. నాగ్‌వీర్ నానమ్మ సత్యవర్ధనిని వీరనాగుడి గుడికి రమ్మంటూ కబురు పెట్టాడు నారాయణ పంతులు.

ఆయన నుంచి కబురనేసరికి ఏదో చాలా ముఖ్యమైన విషయమే అయ్యుంటుందని గ్రహించి, వెంటనే బయల్దేరి వచ్చింది.

గుడిలో పూజనీ, అభిషేకాల్నీ కుర్రపంతులుకి అప్పగించి, వీరనాగుడి పుట్ట వైపు నడిచాడు నారాయణ పంతులు. ఆయన వెనుకే నడుస్తున్న సత్యవర్ధని.. నారాయణ పంతులు ముఖంలోని సీరియస్‌ని చూసి ఏమైందో అనుకుంటూ, ఎంతో ఆందోళనతో మరెంతో గాభరా పడుతూ నడుస్తోంది.

"నాగ్‌వీర్ శారీరక పరిస్థితి చూస్తే నాకెందుకో చాలా భయంగా ఉందమ్మా.." పుట్టకి దణ్ణం పెడుతూ గంభీరకంఠంతో నోరు విప్పాడాయన.

"మీరేం చెబుతున్నారో అర్థంకాలేదు నారాయణ గారూ. నాగ్‌వీర్‌కి మరో గండం ఏమైనా ఉందా.." అని ఎంతో కంగారుగా అడిగిందావిడ.

"గండమంటే పెద్ద గండమేం కాదు తల్లీ. కానీ గండం లాంటిదే. ఇకపై నాగ్‌వీర్ ఎంతో జాగరూకతతో ఉండాల్సిన సమయం వచ్చింది. ఆ రోజు నాగ్‌వీర్ ప్రాణాల్ని కాపాడ్డానికి మరో మార్గమేం దొరకలేదు మనకి. కానీ.. ఆ వైద్యం ప్రాణాల్ని నిలిపేది మాత్రమే కాదు, కామోద్దీపన శక్తిని ఎన్నో అనేక వేల రెట్లు పెంచి, ఎదుటి మనుషుల్ని తన వశీకరణంతో లొంగదీసుకునేంత అపారమైన శక్తి కలది.." అని ఆపాడాయన.

ఆ మాటలు వినగానే ఉలిక్కిపడిరది సత్యవర్ధని.

"వయసులోకొస్తున్న నాగ్‌వీర్‌తో చాలా ఇబ్బందులు తలెత్తుతాయి. మీరు ఎంతో మంది దృష్టిలో అభాసుపాలు అవ్వాల్సివస్తుంది.." అని ఆవిడ మీదున్న గౌరవంతో, ఆయన మనవరాలు ఉష విషయాన్ని బయట పెట్టలేదాయన.

"అలా అనకండి నారాయణ గారూ. నాకేం తోచట్లేదు.. ఇప్పుడేం చెయ్యమంటారో ఏదైనా సలహా చెప్పండి.." ఆదుర్దాగా అడిగింది సత్యవర్ధని.

"వీలయినంత త్వరగా నాగ్‌వీర్‌కి పెళ్ళి చేయండి.." కరాఖండిగా చెప్పాడాయన.

"పెళ్ళా..! పదహారేళ్ళకే..!!" షాక్‌తో అడిగిందావిడ.

"జరగబోయే అనర్థాల్ని ఆపాలంటే అదొక్కటే మార్గం. ఇంతకంటే నేను మీకేం చెప్పలేను.." అని విసురుగా గుడిలోకి వెళ్ళిపోయాడు నారాయణ పంతులు.

* * *

ఆ సంఘటన జరిగిన తర్వాత పది సంవత్సరాలు ఎంతో వేగంగా గడిచిపోయాయి.

ఆ రోజు సాయంత్రం ఆరు గంటవుతోంది సమయం. యన్వీ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలోంచి గుంపులు గుంపులుగా బయటకు వస్తున్నారు అనేక మంది అమ్మాయిలూ, అబ్బాయిలూ.

చూడడానికి కలర్‌ఫుల్‌గానూ ఎంతో ఆహ్లాదంగా కూడా ఉంది ఆ యూత్‌ఫుల్‌నెస్. వాళ్ళందరూ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్.

ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోతున్నప్పుడు.. సరిగ్గా అదే టైంలో హైయ్యర్ స్టడీస్ పూర్తి చేసుకుని, యూఎస్ నుంచి ఇండియాకి తిరిగొచ్చాడు నాగ్‌వీర్. కొత్తగా ఏర్పడిన రాజధాని అమరావతిలో యన్వీ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఐటీ కంపెనీ అప్పటికప్పుడే స్టార్ట్ చేశాడు.

పగలూ రాత్రీ దాని కోసమే ఎంతో కష్టపడి, ఎన్నో ప్రాజెక్ట్‌లని సమర్ధవంతంగా పూర్తి చేసి, ఐటీ రంగంలో అతి తక్కువ టైంలోనే అనూహ్య విజయం సాధించాడు. స్థాపించిన ఈ కొద్ది సంవత్సరాల్లోనే బాగా క్లిక్కై యన్వీ ఐటీ సొల్యూషన్స్ నెంబర్ వన్ పొజీషన్‌కి వచ్చింది.

అలాంటి సక్సెస్‌ఫుల్ నాగ్‌వీర్ కంపెనీలో నిన్ననే ప్రోగ్రాం డిజైనర్‌గా జాయినైంది శిల్ప. కొత్త కంపెనీలో కొత్త వర్క్ చాలా శాటిస్‌ఫేక్షన్‌గా అనిపిస్తోందామెకి. క్రియేటివ్‌గా ఆలోచించి, ఆకారం లేని ఎన్నో ఆలోచనల్ని ఒడిసి పట్టుకుని, ప్రోగ్రామ్‌గా రూపొందించే సాఫ్ట్‌వేర్ ప్రొఫెషన్ అంటే శిల్పకి ఎంతో పేషన్.

ఆఫీస్ అవర్స్ అయిపోవడంతో అందరూ ఎవరి వెహికల్స్ మీద వాళ్ళు రయ్యిరయ్యిన బయటకు దూసుకుపోతున్నారు.

శిల్ప స్కూటీ రిపేరులో ఉండి ఉదయం బస్‌లో వచ్చింది. బస్‌స్టాప్‌కి ఐదు నిముషాలు నడవాలి. కొత్తగా జాయినవడంతో ఎవరినీ లిఫ్ట్ కూడా అడగలేక, ఫుట్‌పాత్ మీద ఒంటరిగా నడుస్తోందామె.

సరిగ్గా అప్పుడే కీచుమని శబ్దం చేస్తూ శిల్ప నడుస్తున్న ఫుట్‌పాత్ పక్కగా ఆగింది ఓ కారు. ఉలిక్కిపడుతూ తల తిప్పి చూసింది శిల్ప. తమ ఎమ్.డీ నాగ్‌వీర్ డ్రైవింగ్ సీట్లో కనిపించాడు. రిలాక్స్‌గా ఊపిరి పీల్చుకుందామె.

"ఎనీ ప్రాబ్లెమ్.." చూపులు కలవడంతోనే శిల్పని అడిగాడు నాగ్‌వీర్.

"స్కూటీ రి..పే..ర్.."

"మధురానగర్ కదా.. నేనూ అటు వైపే.. డ్రాప్ చేస్తాను ఎక్కండి.." అని డోర్ తీశాడు నాగ్‌వీర్.

ఆశ్చర్యపోతూనే మొహమాటంగా కారులోకి ఎక్కింది శిల్ప. రెజ్యూమ్‌లో చూసిన అడ్రెస్‌ని ఇంత బాగా గుర్తుపెట్టుకుంటారా అనుకుంటూ, డోర్ వేసి ఫ్రంట్ సీట్లో బిడియంగా కూర్చుంది. కారు ముందుకు దూకింది.

నాలుగు రోజుల క్రితం ఇంటర్వ్యూకి వచ్చినప్పుడు మొదటిసారి నాగ్‌వీర్‌ని చూడగానే, 'ఇంత చిన్న వయసులోనే అంత హై రేంజ్ డెవలప్‌మెంటా' అని ఎంతో ఆశ్చర్యపోయింది శిల్ప. ఆ డెవలప్‌మెంట్‌కి కూడా ఏదో బలమైన కారణం ఉండే ఉంటుందని అనుకుంది. అది వెంటనే గమనించింది కూడా.

ఆకర్షించే చూడచక్కని రూపం, మంచి హైటు, దానికి తగ్గ హ్యాండ్సమ్ పర్సనాలిటీ, అన్నిటికంటే ముఖ్యంగా అతని కళ్ళు.. ఎస్ ఆమెకి అవే ఎంతో బాగా నచ్చాయి. ఆ కళ్ళల్లోకి చూస్తే.. ఇంకేం మాట్లాడలేను అని తెలిసి కూడా మళ్ళీమళ్ళీ చూడాలనిపించే అతని కళ్ళ వైపు తల తిప్పి చూసింది శిల్ప.

దృష్టిని రోడ్ మీదే కాన్‌సెన్‌ట్రేషన్ చేస్తూ హుందాగా కారు డ్రైవ్ చేస్తున్నాడు నాగ్‌వీర్. రెండు నిముషాలు గడిచిపోయాయి. అయినా శిల్ప ఇంకా అతడి కళ్ళలోకి అలా చూస్తూనే ఉంది. నాగ్‌వీర్ చూపులు రోడ్ మీదే ఉన్నా, సైడ్‌లుక్‌లో శిల్ప అతన్నే మైమరచి చూస్తున్నట్టు క్లియర్‌గా తెలుస్తోంది. అంతే.. సడెన్‌గా తల తిప్పి ఏంటన్నట్లుగా కళ్ళెగరేశాడు.

ఒక్కసారిగా తడబడిపోయింది శిల్ప. "ఏం లేదు. మీకు.. అర్జెంట్ వర్క్కేం లేకపోతే మా ఇంట్లో కకా..ఫీ.. కా..ఫీ తీసుకుని వెళుదురు.." అని కంగారుగా అంది.

చిన్నగా నవ్వాడు నాగ్‌వీర్. మరో పది నిముషాల్లో శిల్ప ఇంటి ముందాగింది కారు. ఇంటి డోర్ లాక్ చేసి ఉంది. కీ కోసం చూసింది. అది ఎప్పుడూ పెట్టే సీక్రెట్ ప్లేస్‌లోనే ఉంది.

ఆమెకంతా కంగారుగా ఉంది. అతడిని ఇన్వైట్ చెయ్యడమైతే చేసేసిందిగానీ, అతడు వస్తానంటాడని ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదు. ఇప్పుడు నాగ్‌వీర్‌కి కాఫీ ఇవ్వాలంటే ఆ విద్య తనకి రాదే అని లోలోపల తెగ ఫీలైపోతోంది. ఏం చేయాలో అర్థంకాలేదు శిల్పకి. డోర్ లాక్ తీసి అతన్ని ఇంట్లోకి ఆహ్వానించింది.

టెన్షన్ పడుతున్న శిల్ప ముఖాన్ని గమనించాడు నాగ్‌వీర్. "ఓకె. బై శిల్పా. నేను ఇంకోసారెప్పుడైనా వస్తాలే.. ఏదో ప్రాబ్లెంలో ఉన్నట్టున్నావ్.." అని వెనక్కి తిరగబోయాడు.

"పర్లేదు కూర్చోండి. సమ్.. ఎవరికో బాలేదన్నారు. మావాళ్ళు అక్కడకే వెళ్ళినట్టున్నారు. వచ్చేస్తారు.." కంగారుపడుతూ అంది.

"ఓకె. మిమ్మల్ని చూస్తుంటే కాఫీ ప్రిపేర్ చెయ్యగలరా అనిపిస్తోంది. మే బి టాప్ ర్యాంకర్స్‌కి పేరెంట్స్ అన్నం ముద్దలు కలిపి పెడుతుంటుంటారు కదా.." అని నవ్వుతూ కూర్చున్నాడు నాగ్‌వీర్.

శిల్ప కూడా దొరికేశాను అన్నట్టు మొహమాటంగా నవ్వింది.

"పదండి కిచెన్‌లోకి.. కాఫీ ఎలా చెయ్యాలో నేను చెప్తాను.." అన్నాడతను.

"సారీ.." అని ఆమె ఇంకేదో చెప్పబోతుంటే, "కమాన్ ఐ సే.." అంటూ ముందుకు అడుగులేశాడు నాగ్‌వీర్.

గబగబా మెయిన్‌డోర్ వేసి, పరుగులాంటి నడకతో కిచెన్‌లోకి వచ్చింది శిల్ప. "మీరు ఇలా.. మా ఇంటికి రావడమ్.. ఇలా కాఫీ.. ఇదంతా నేనస్సలు నమ్మలేకపోతున్నాను.." అని సంబరపడుతూ ఫ్రిజ్‌లోంచి పాల పేకెట్ తీసింది.

"ఇట్సోకె. కలిసి కప్‌ఆఫ్ కాఫీ అనుకున్నది కలిసి కాఫీ చేసుకుని కలిసే తాగబోతున్నాం.." అని శిల్ప ముఖంలోకి అదోలా చూశాడు నాగ్‌వీర్.

అతనన్న విధానానికి నవ్వుతూ నాగ్‌వీర్ వంక చూసింది శిల్ప. అంతే.. చూపుల్ని మళ్ళీ వెనక్కి తిప్పుకోలేకపోయింది. రెప్పవేయడం కూడా మరిచిపోయింది.

నాగ్‌వీర్ జస్ట్ అలా.. చూస్తేనే ఎదుటివాళ్ళు ఫ్లాట్ అయిపోతారు. అలాంటిది ఆ కళ్ళు కాంక్షతో చూస్తే..? ఇప్పుడు అలానే చూస్తున్నాయి నాగ్‌వీర్ కళ్ళు.

శిల్ప తనకి తెలియకుండానే ఒకలాంటి మైకంలోకి జారిపోయింది. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్నంతా పూర్తిగా మర్చిపోయింది. సమయం గడుస్తోంది. ఏవేవో జరుగుతున్నా ఆమెకేమీ తెలియట్లేదు. ఏదో తీయనైన పరవశంతో పూర్తిగా మైకంలో ఉండిపోయింది.

అలా ఎంత సమయం గడిచిందో.. శరీరం మీద తెలుస్తున్న బరువుకి ఉలిక్కిపడ్డట్టుగా ఈ లోకంలోకి వచ్చింది. చుట్టూ చూస్తే.. తన బెడ్ రూమ్‌లో మంచం మీద ఉంది తాను.

ఏం జరిగిందో అర్థంకాని విస్మయంతో తన పైనున్న నాగ్‌వీర్ కళ్ళలోకి మళ్ళీ చూసింది. అంతే..! అయస్కాంతానికి అంటుకున్న ఇనుప ముక్కలా అతన్ని హత్తుకుని అలా ఉండి పోయింది. కొన్ని క్షణాలు.. ఆమెలో ఆమె అస్సలు లేకుండా కూడా పోయింది. అది ఎన్ని క్షణాలో లెక్క తెలియలేదు.

ఆ మైకంలోంచి ఎప్పటికో బయటకొచ్చింది శిల్ప. మత్తుగా కళ్ళు తెరిచింది. అప్పుడే నాగ్‌వీర్ చిరునవ్వుతో కాఫీ కప్పుని తెచ్చి బెడ్‌హెడ్ మీద పెట్టాడు. వింతగా చూసింది అతని వంక.

"థ్యాంక్యూ వెరీ మచ్.. ఇట్స్ వెరీ స్వీట్ విచ్ ఐ నెవర్ టేస్టెడ్.. ఓకె. బై సీయూ టుమారో.." అని సన్నని నవ్వుతో చెప్పి, ఆ గదిలోంచి బయటకు వెళ్ళిపోయాడు నాగ్‌వీర్.

ఏదో అస్తవ్యస్తత శిల్ప సిక్త్‌సెన్స్‌కి తెలుస్తోంది. ఒంటి మీదున్న బ్లాంకెట్ తీయబోతూ, క్యాజువల్‌గా తన శరీరం వంక చూసుకుంది. అంతే..! కెవ్వుమని పెద్దపెట్టున అరుస్తూ ఒక్కసారిగా సిగ్గుతో బ్లాంకెట్‌ని మళ్ళీ కప్పేసుకుంది.

అసలు ఏం జరిగిందో శిల్పకి ఇప్పుడు, అదీ నాగ్‌వీర్ ఆ గదిలోంచి వెళ్ళిపోయాక. జరిగింది మొత్తం రివైండ్ అవుతోంది. కిచెన్ రూమ్‌లో తన శరీరం నాగ్‌వీర్ చేతుల్లోకి వెళ్ళిపోవడం, తరువాత అతను చేసిన గమ్మత్తైన చిలిపి పనులూ, ఆ తరువాత బెడ్‌రూమ్‌లోకి రావడం.. అన్నీ.. అన్నీ ఇప్పుడు కళ్ళముందు ఎంతో స్పష్టంగా కనిపిస్తున్నాయి శిల్పకి.

తాను కనీసం వారించను కూడా వారించకుండా అలా ఎలా ఉండిపోయిందో అస్సలు అర్థం కావట్లేదు. కనీసం నాగ్‌వీర్ చేతుల్లోంచి బయట పడడానికి ప్రయత్నించడం గానీ, అట్లీస్ట్ వద్దంటూ గట్టిగా అరవడంగానీ చేయలేదు. అది తలచుకుంటుంటే నాగ్‌వీర్ చేసిన దాని కంటే, తాను చేసిందే ఎంతో పెద్ద తప్పులా తోస్తోంది శిల్పకి.

తప్పు అనుకోగానే గుండె గుభేలుమంది. అంతే.. వెంటనే లేచి కంగారుగా డ్రెస్సప్ అయ్యి, గబగబా శిల్ప బెస్ట్‌ఫ్రెండ్ హాసినీకి ఫోన్ చేసింది. కాల్ ఒకె అయ్యింది. "హలో హాసీ.." ఆదుర్దాగా అరిచింది.

"ఆ.. నేనే. ఏంటే అలా టెన్షన్‌గా ఉన్నావ్..! ఏమైంది.." వెంటనే అడిగింది హాసినీ.

"ఏం లేదు.. అదీ.. అదీ.. నిన్న యన్వీ ఐటీలో జాయిన్ అయ్యాను కదా.."

"ఆ.. అవును.."

"మా బాస్ నాగ్‌వీర్ ఈ రోజు మా ఇంటికి వచ్చాడు.."

"ఆ.. వస్తే.."

"అన్‌ఫార్చునేట్లీ.. నేనూ.." నీళ్ళు నమిలింది శిల్ప.

"ఆ.. నువ్వూ.. ఏమైందే..?" అని అటు నుంచి క్యూరియస్‌గా అడిగింది హాసిని.

"నేనూ, నాగ్‌వీర్ అన్‌ఫార్చునేట్‌లీ 'ఆ..' తప్పు చేసేశాం. ఇప్పుడు నేనేం చెయ్యాలి..?"

"వ్వాట్..!"

"అవునే.. కాఫీకని నేనే అతడిని ఇంటికి పిలిచాను. కానీ, ఇంట్లోనేమో ఎవరూ లేరు. ఏంటో అనుకోకుండా అలా జరిగిపోయిందే.."

"ఏంటే జరిగిపోయేది, వాడంత ఫోర్స్ చేస్తున్నప్పుడు లాగి ఒకటి పీకాల్సింది.. లేకపోతే నాకు ఫోన్ చేసుండాల్సింది.."

"నాగ్‌వీర్ అంత ఫోర్సేం చెయ్యలేదే.. జస్ట్ అదోలా చూశాడు. అదేంటో.. తర్వాత జరిగిందేదీ నాకు అస్సలు తెలియలేదు. తెలిసిన తర్వాత కూడా నేను ఎందుకో రెసిస్ట్ చెయ్యలేకపోయానే.."

"నువ్వేం చెబుతున్నావో నీకర్థమవుతుందా.. ఉత్తి అదోలా చూస్తేనే నీకు నువ్వే ఎలా కమిటవుతావ్..! ఆర్యూ ష్యూర్..?" విస్తుపోతూ అడిగింది హాసినీ.

"కన్‌ఫాం హాసీ. ఎందుకూ, ఎలా, అంటే.. ఏమో ఐ డోన్ట్ నో. బట్.. నాకు చాలా భయంగా ఉంది. మీ నైబర్స్‌లో ఎవరో జూనియర్ డాక్టర్ ఉందన్నావుగా, ముందు తనని అడిగి ప్రికాషన్ ఏదన్నా చెప్పు.. ప్లీజ్‌ప్లీజ్.." బతిమాలింది శిల్ప.

"ఒకేలే. ఫోన్ చేసి కనుక్కుంటాను. కంగారు పడకు. టాబ్లెట్స్ తీసుకుని నేనే వస్తా. టెన్షన్‌తో పిచ్చిపిచ్చి ఆలోచనలు చేయకు.." అని చెప్పి ఫోన్ కట్ చేసింది హాసిని.

* * *

రాత్రి పదిగంటలు..

బెడ్ మీద అటూ ఇటూ దొర్లుతోంది శిల్ప. ఆమెకి అస్సలు నిద్ర రావట్లేదు.

రేపు ఉదయం ఆఫీస్‌కి వెళ్ళాలి అనుకుంటుంటే ఎంతో టెన్షన్‌గా ఉంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Dangerous+Guy**

* * *